

# ఆరనిమంట

—లక్ష్మీ సుబ్బారావు

నా ప్లేటులో చేగోడీలు ఎందుకు పెట్టావ్?" దాదాపు అరిచినంత పని చేసింది జానకి. ఈ రోజు ఉదయం నుండీ తన మనసేమీ బాగా లేదు. పక్కింటి రాఘవమ్మగారి హృదయ విదారకమైన ఏడుపు ఇప్పటికీ చెవిలో గింగురుమంటూంది. వాళ్ల రెండో అబ్బాయి మోహన్ ఇటీవల పాకిస్తాన్ యుద్ధంలో అసువులు కోల్పోయాడు, పాపం! ఆ అబ్బాయి దుస్తులూ అవీ వాళ్ల ఇంటి అడ్రెసుకు ఈ ఉదయమే తిప్పి పంపబడ్డాయి. అవి చూసి ఆమె చేసిన ఆక్రందన. . . తన కడుపు కలిగి పోయింది దుఃఖంతో. ఆరేడేళ్ల క్రితం బావకూడా ఇదే పాకిస్తాన్ యుద్ధంలో... మనసంతా దిగులుమయమై పోయింది. పైగా, ఇప్పుడీ సంఘటన. ప్లేటులో చేగోడీలు చూసిందే తనకు పట్టరాని ఆవేశం వచ్చేసింది. ఆ దుఃఖావేశంలోనే తను అంత గట్టిగా అరిచింది!


డైనింగ్ టేబిలుచుట్టూ కూర్చున్న శ్రీహరి, మధు, గోపీ, వంటావిడ సీతమ్మతో సహా అందరూ ఉలిక్కి పడ్డారు. జానకి అరిచిన అరుపుకి. అమ్మ ఇంత గట్టిగా మాట్లాడటం బుద్ధెరిగి చూడలేదు తాము! బెరుకుగా చూశారు అమ్మ వంక మధు, గోపీ ఇరువురూ. జానకి గొంతులో ఇంత కరుకుదనం ఉందని ఈ రోజే గుర్తించాడు శ్రీహరి. ఆశ్చర్యంగా చూశాడు భార్య వంక. తను వంటకు కుదిరినప్పటినుండీ అమ్మగారు అదిలించటం ఇంతవరకూ తెలియదు సీతమ్మకు. భయం భయంగా చూసింది సీతమ్మ అమ్మగారి వంక.

విస్తుపోతూ చూస్తున్న పిల్లలనూ, భర్తనూ, ఆఖరికి సీతమ్మనూ చూసి తన ఆవేశానికి క్షణకాలం సిగ్గుపడి పోయింది జానకి. ఎలాగో సర్దుకుని పిల్లలతో అన్నట్లుగా— "అదేమిట్రా అలా చూస్తున్నారు? నాకు చేగోడీలంటే ఇష్టం లేదు, అందుకనే వద్దన్నాను. మీరు తినండి, బాబూ. సీతమ్మా! మరేం, నాకు ఇంకాస్త ఉప్మా పట్రా. ఏమండీ! సీతమ్మ

ఈవేళ ఉప్మా గుమగుమలాడుతూ చాలా రుచిగా చేసింది. మీరూ ఇంకాస్త వేసుకోండేం?'' అంది. వాతావరణం మామూలుగా మారింది. పిల్లలు తేలిగ్గా ఊపిరి వదిలి తినటంలో నిమగ్నమయ్యారు. అమ్మగారు అడిగిందే తడవు ఇంకాస్త ఉప్మా తేవడానికి వంటగది కేసి వెళ్లింది సీతమ్మ. శ్రీహరి మాత్రం కాస్త అనుమానంగా చూశాడు భార్య వంక. ఒకవేళ చేగోడీలంటే ఇష్టం లేనంత మాత్రాన అంత గట్టిగా అరవవలసిన పని లేదు. అందునా జానకి స్వభావానికి పూర్తిగా విరుద్ధంగా ఉంది ఈ వేళటి ప్రవర్తన. బహుశా జానకి మూడ్ సరిగా లేదేమో? క్లబ్బులో తనకు చిరాకు కలిగించిన సంఘటన ఏదైనా జరిగి ఉండవచ్చు. ఏమోలే, తనే కాస్సేపటికి చెప్పకపోతుందా అనుకుంటూ మామూలుగా తినసాగాడు అతను. కాని, ఎంత మామూలుగా ఉండటానికి ప్రయత్నించినప్పటికీ చేగోడీలను చూస్తుంటే మాత్రం తనలోని దావాగ్ని తననే దహించి వేస్తుందేమో అనిపించింది జానకికి!

తల్లితండ్రులను పోగొట్టుకొని అనాథగా తమ పంచ చేరిన సుధాకరం బావంటే ఎక్కడలేని అయిష్టం ఏర్పడింది నాన్నకు, ఎందుకో. తన అయిష్టాన్ని మాటల్లో వెలిబుచ్చుతుండేవారు


# పాపం యీ దంతం హత్యచేయబడింది!



మరీ దారుణంగా. కొంచెంకొంచెంగా విషం యిచ్చి చంపినట్లు. చిట్ట చివరి క్షణం దాకా, అంటే పన్ను ఊడి వచ్చేవరకూ యీ ఘోరమైన సత్యం తెలియనేలేదు. తెలియదేమిటంటే — తెలిసి చేసిన అశ్రద్ధ అని అటువంటి సరియైనదికాని టూత్‌బ్రష్‌తోనూ, టూత్‌పేస్ట్‌తోనూ పళ్ళను తోమటం.

మరి బినాకా ఫ్లోరైడ్ గనక తప్పకుండా ఎప్పుడూ వాడివున్నట్లయితే, యీ విషాద సంఘటన జరిగివుండేది కాదు. ఎందువల్లనంటే, బినాకా ఫ్లోరైడ్‌లోగల యస్‌ఎమ్‌ఎఫ్‌పి మూడు విధాలుగా పళ్ళల్లోని కంతల్నుంచీ దంతక్షయాన్నుంచీ రక్షిస్తుంది.

- పంటి ఎనామిల్‌ని గట్టిపరచటానికి
- నోటిలో తయారయ్యే ఏసిడ్ తయారు కాకుండానూ
- దంతక్షయాన్ని అరికట్టటానికి

మీ పళ్ళని హత్య చేయకండి
మీ పళ్ళని కాపాడుకోవటం కోసం

**బినాకా ఫ్లోరైడ్**




CIBA Cosmetics

ULKA-CF-38-TEL



గుంతకల్లు టెలికాం రిక్రియేషన్ క్లబ్ వార్షికోత్సవ సందర్భంలో నృత్య ప్రదర్శనం ఇచ్చిన ఏడేళ్ళ బేబి సత్యప్రియ

ఎప్పుడూ. అమ్మ లోలోన తన దుఃఖాన్ని దిగమింగుకొనేది—కానీ, పైకి ఏమీ అనేది కాదు. తన ఒక్కగానొక్క అన్న చనిపోయాడు. పుట్టింటి వారంటూ ఎవ్వరూ మిగలలేదు తనకి. అన్న చనిపోవటమే తీరని దుఃఖం కలిగించింది. పైగా, అన్నకొడుకు ఇలా గతిలేని వాడిలాగా తన దగ్గర పెరగడం అమ్మను లోలోనే కుంగదీసేది. పైకి ఏమన్నా అంటే ఉన్న ఈ ఆధారం కాస్తా కూడా లేకుండా పోతుందేమోనని నాన్న ఏమన్నా కూడా ఊరుకొనేది. వాడికి రెక్కలు వచ్చేదాకా ఎలాగో కాలం వెళ్లబుచ్చితే ఆపైన వాడి అదృష్టం ఎలా ఉంటే అలా జరుగుతుంది. ఇలా అనుకొంటూ ఓపిక వహించేది అమ్మ. తనకు బావంటే చెప్పలేని జాలి. చిరిగిన షర్టుతో, జారి పోతున్న నిక్కరు పైకి ఎగదోసుకుంటూ, నాన్న ఏమన్నా అంటే ముదురుమీద పడ్డ జుత్తును వెనక్కి తోసుకుంటూ నాన్న వంక భయం భయంగా చూసే బావ మొహం తన కిప్పటికీ బాగా గుర్తు. రాను రాను బావ ఉనికినే సహించలేక పోతుండేవారు నాన్న. అనవసరంగానే కేకలు వేసేవారు బావమీద.

నాన్న దగ్గర మాటలు పడుతూనే, అమ్మ ఆప్యాయతను చాటున అందుకొంటూనే అలాగే రోజులు నెట్టుతూ స్కూలుఫైనలు అయిందనిపించాడు బావ. తనూ ఫోర్తు ఫారమ్ పాసయింది. తనకు బావను చూస్తుంటే జాలి తప్ప మరే భావం కలిగేది కాదు. అయితే, బావ చూపులు మాత్రం అదోలా ఉండేవి. ఏకాంతంగా ఉన్నప్పుడు ఏదో చెప్ప వచ్చేవాడు కానీ, చెప్పలేకపోయేవాడు.

**జీవితం పరమపద సోపాన పథం వంటిది. పావులు లాంటి ప్రయత్నాలు చేయడం, ఆశలు పెంచుకోడం తన వంతు. జయాపజయాలు తన చేతిలో లేవు. మమతలను పెంచుకోడం వరకే మనసుల వంతు. చిగురిస్తే అందలం ఎక్కే మనిషికి ఆ ఆశలవంటి కోర్కెలు ఎండిపోతే కలిగే గుండెలలోని మంటలు చల్లారని జ్వాలలు అయితే...**

ఒక రోజు నాన్న ఎందుకో కేక లేస్తున్నారు అమ్మమీద, తను స్కూలు నుండి వచ్చేటప్పటికి. తన కేమీ అర్థం కాలేదు మొదట. నాన్న మాటలు స్పష్టంగా విన్న తరవాత స్ఫురించింది అప్పుడు. "అవునే, నీ ఎత్తు ఇదన్న మాట! సకల భోగభాగ్యాలతో అలరారుతున్న నీ ముద్దుల మేనల్లుణ్ణి నాకూతురికి కట్టబెట్టాలా! చాల్లే, నోర్ముయ్! పైసా గతిలేని వెధవకి నా కూతుర్ని చచ్చినా ఇవ్వను. నేను మొదటే అనుమానించాను—ఇటువంటి గూడుపుఠాణీ ఏదో జరుగుతుందని. ఇంక ఇలానే ఇంట్లో పెట్టుకొని ఉంటే రేపు ఏ అఘాయిత్యమైనా చేసినా చేస్తాడు. నీవూ మద్దతుగా ఉన్నావుగా! చూడు, ఇంక నా వల్ల కాదు. స్కూల్ ఫైనల్ పాసయి ఏడ్చాడుగా—తన బ్రతుకేదో బ్రతకమను." చాలా కరుకుగా ఉన్నాయి నాన్న మాటలు. తను లోనికి కదుగెడుతూంటే తన వెనక ఏదో నీడ కదిలినట్లయి, చటుక్కున వెనుతిరిగి చూసింది తను. బావ వెళ్లి పోతున్నాడు గబగబా. అయితే ఇందాకా నాన్న అన్న మాటలు. . . ఛ! బావ మనసు ఎంత బాధ చెంది ఉంటుందో ఆ మాటలకు! తను నిస్సహాయురాలే అయింది అప్పుడు.

ఆ రాత్రి బావ ఎవ్వరితోనూ మాట్లాడలేదు. భోజనం చేసిందే చీకట్లో అరుగుమీద చాలాసేపు కూర్చున్నాడు ఏదో యోచిస్తూ. బావ వాలకం తనకు చాలా భయం కలిగించింది. రాత్రల్లా తనకు నిద్ర పట్టలేదు. ఉదయం లేచిందే తను బావ గదివద్దకు వెళ్లి చూసింది ఆత్రతగా. గదిలో బావ లేడు! ఎక్కడికెళ్లినట్లు? ఇంత త్వరగా లేచే అలవాటు బావకు లేదే? అనుమానం ఎక్కువ కాగా గదిఅంతా కలయజూసింది. బావ ఎప్పుడూ తన ట్రంకుపెట్టె ఉంచే స్థలంలోనే ఒక ఉత్తరం మడత పెట్టబడి ఉంది. ట్రంకుపెట్టె లేదు. తడబడే చేతులతో ఉత్తరం విప్పి చూసింది.

"ఈ అభాగ్యుడి కోసం ఇక్కట్ల పాలయింది చాలత్తయ్యా. మీ దయ వల్ల నా బ్రతుకు నేను బ్రతకగలిగే యోగ్యత కల్పించారు. ఇది నా జన్మాంతం మరవలేను. నాకు ఎవ్వరిమీదా కోపం లేదు. స్కూల్ ఫైనల్ పాసయిన రోజు నుండీ నేను ఉద్యోగ ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. నేను ఒక మనిషినయిన తరవాత ఈ ఊరికి వస్తాను. కనీసం నీతోనైనా చెప్పకుండా వెళ్లిపోయాడే అనుకోకు. నీ కన్నీళ్లు చూస్తే ఇక ముందుకు అడుగు పడదు నాకు. ఇలా వెళ్లిపోతున్నందుకు మీ రంతా క్షమించాలి నన్ను."

కన్నీళ్లు జలజలా రాలిపోతుంటే పరుగెత్తుకెళ్లి అమ్మకు చూపించిం దా ఉత్తరాన్ని తను. అమ్మ షాక్ తగిలినట్లు ఉలిక్కిపడింది మొదట. పది నిమిషాల భయంకర మౌనం తరవాత ఈ మాట మాత్రం అంది: "అభిమానం గలవాణ్ణే అనిపించుకొన్నాడు. ఎక్కడైనా సుఖ పడనీ." కంఠం బొంగురుపోతుంటే ఆ పైన మాట్లాడలేకపోయింది. నాన్న ఉత్తరం చూసి ఏమీ చలించలేదు. పీడ విరగడయిందన్నట్లుగా తేలిగ్గా ఊపిరి వదిలారు.

కాలం దొర్లిపోతుంటే క్రమక్రమంగా బావను మరిచిపోయింది తను. అమ్మ మాత్రం దిగులుగా కన్నీళ్లు పెట్టుకొనేది, అప్పుడప్పుడూ బావను తలుచుకొని. కొన్ని వేలు ఖర్చు చేసి తన పెళ్లి శ్రీహరితో జరిపించారు నాన్న. భర్త ఇంటివాళ్లు బాగా ఆస్తిపరులు. పెళ్లవటం, తను కాపరానికి వచ్చేయటం, మధు పుట్టడం వరసగానే జరిగిపోయింది. తన కేమీ లోటు లేదు. సుఖంగా సాగిపోతూంది తన సంసారం. అమ్మ, నాన్న మురిసి పోతుండేవారు తన సంసారం చూసి. తన స్మృతిపథం నుంచి పూర్తిగా అదృశ్యమైపోయాడు బావ.

కానీ, ఎప్పుడూ సంతోషంగా ఉండటం భగవంతుడుకూడా సహించడేమో? ఒక రోజు నాన్న దగ్గరినుండి టెలిగ్రామ్ వచ్చింది — అమ్మకు సీరియస్‌గా ఉందనీ, బయలుదేరి రమ్మనీ. ఉరుకులు, పరుగులతో వెళ్లి వాలింది తను అమ్మ దగ్గరికి. నిర్జీవంగా ఉన్న ఆ కళ్లు తనను చూస్తూనే వెలుగు నింపుకొన్నాయి. బల్లిలా మంచాని కంటుకుపోయిన అమ్మను చూస్తూనే తన గుండె అవిసిపోయాయి. ఆ రాత్రి అమ్మ తనను దగ్గరికి రమ్మని సైగ చేసింది. హీన స్వరంతో, "అమ్మడూ, నాకు పోయిన నెలే ఒకసారి గుండెనొప్పి


తీవ్రంగా వచ్చింది. నీకు తెలియపరిస్తే దిగులుపడతావని. . ." అంది. ఆయాసం కలిగింది ఆ మాటలు పలకడానికే అమ్మకు. "వద్దమ్మా, పడుకో. తెల్లవారి మాట్లాడుదువుగాని. . ." అమ్మను వారిస్తూ అంది తను. కానీ, అమ్మ అంది: నేన్ను మాట్లాడనీ, తల్లీ ... చూడు. . . బావ ఎప్పుడైనా . . . నీ గడప . . . ఎక్కివస్తే... వాణ్ణి ఏ విధంగానూ. . . నొప్పించకు. . . అమ్మడూ . . . పిచ్చి సన్నాసి. . . నీ. . . మీద. . . వెర్రిఆశ పెట్టుకున్నాడు. . . ఎక్కడున్నాడో..." ఆయాసం మళ్లీ ఎక్కువైంది. "అలాగేనమ్మా." అతి ప్రయత్నంతో గొంతు పెకలించుకు వచ్చింది ఆ మాట తనకు. అవే అమ్మ ఆఖరు మాటలు! మరునాటి ఉదయం అమ్మ తననూ, నాన్ననూ శోకసముద్రంలో ముంచి వెళ్లిపోయింది ఈ లోకంలోంచి.

అమ్మ పోయిన దగ్గరి నుండీ తనలో మునుపటి ఉత్సాహం చచ్చిపోయింది. ఏదో అలా గడిచిపోతూంది కాలం బరువుగా. విశ్వం పుట్టాక తనలో కాస్త సంచలనం కలిగింది. వాడు చిన్ని చిన్ని అడుగులతో ఇల్లంతా కలయతిరగడం, ముద్దు ముద్దుగా మాట్లాడటం, వాడి చిలిపి చేష్టలతో మళ్లీ తన మనసు జీవం సంతరించుకొంది క్రమక్రమంగా.

ఒక రోజు తను వంట ఇంట్లో అత్తయ్యకు సాయం చేస్తూంది, ఏదో కబుర్లు చెప్తుతూ. ఇంతలో మధు పరుగెత్తుకుంటూ వచ్చి, "అమ్మా,. అమ్మా. . . ఎవరో జానకిగా రున్నారా అని అడిగారే. ఆ మనిషి బయట వరండాలో నిలబడి ఉన్నారమ్మా. ఇన్‌స్పెక్టరు బాబులా ఉన్నారమ్మా" అంటూంటే, ఎవరై ఉంటారు? అందులో ప్రత్యేకం తన కోసం వచ్చిన వారు ఎవరబ్బా! అనుకొంటూ విసవిసా హాలులోకి నడిచింది.

అక్కడ నించున్న మనిషి పూర్తిగా మిలిటరీ దుస్తుల్లో ఉన్నాడు. అందుకే బాబు ఇన్‌స్పెక్టరుబాబులా ఉన్నారన్నాడు. క్షణంసేపు పరికించి చూసింది తను. "బావ!" ఆశ్చర్యంతో వెలువడింది తన నోటినుండి ఆ మాట!

"రా, బావా, కూర్చో. ఎప్పుడు వచ్చావు?" చాలా కాలానికి బావను ఇలా చూస్తున్నందుకు తను సంతోషం, ఆశ్చర్యం, దుఃఖం— వివిధ రకాల అనుభూతికి లోనైంది. బావకూడా తనలాగే ఫీలయినట్లుంది. కాస్సేపు ఏమీ మాట్లాడకలేకపోయాడు. తననే



ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ గోపాలరావు ఎక్బోటే ఇటీవల మద్రాసు ఆనరరీ మేజిస్ట్రేట్ల సమావేశంలో ప్రసంగించినప్పటి ఫోటో. రాయపేట ఉడ్‌లాండ్స్ హొటల్‌లో జరిగిన ఈ సమావేశంలో సంఘాధ్యక్షుడు శ్రీ జి. వరదప్ప, న్యాయమూర్తి శ్రీ సదాశివం, న్యాయమూర్తి శ్రీ వెంకట్రామన్, శ్రీ నటరాజన్ (ఛీఫ్ ప్రెసిడెన్సీ మేజిస్ట్రేట్) ఉన్నారు.

చూస్తున్న బావ కళ్లు అశ్రుపూరితాలైనాయి.


"జానకీ. . . అత్తయ్య. . ." మరి మాట్లాడకలేకపోయాడు. గొంతుపూడుకుపోవటంవల్ల. వేలికొనలతో కళ్లు ఒత్తుకున్నాడు. తనకీ దుఃఖం ఆగలేదు. చివరికి బావే ఇలా అన్నాడు: "మామయ్యే నీ అడ్రెసు ఇచ్చారు, జానకీ! సరిహద్దు ప్రాంతానికి వెళ్లడానికి ముందు మిమ్మల్నంతా చూసిపోదామని వచ్చాను. ఈ లోకంలో నన్ను అమితంగా అభిమానించే జీవిని పోగొట్టుకున్నాను. దౌర్భాగ్యుడిని!" బావ కంఠం వణికింది. "అన్నట్లు, జానకీ, నేను మిలిటరీలో చేరి నాలుగేళ్లవుతుంది. రేపుసాయంత్రమే మా గ్రూపంతా వెళ్లిపోతున్నాం యుద్ధప్రాంతానికి. . . మరి ఆయన, అదే మీవా రెప్పుడు వస్తారు?"

'మీ వారు' అన్నప్పుడు బావ మొహం చూసింది తను. నిర్మలంగా ఉన్నాయి ఆ చూపులు. ఏ కల్మషమూ లేదా చూపులో అనిపించింది. అత్తయ్యా ఆప్యాయంగానే పలకరించారు బావను. తను కాఫీ ఇస్తూ, "ఈ రోజు ఇక్కడే ఉండిపో, బావా. ఆయనా వచ్చేస్తారు" అంది. బావ వెంటనే—"ఊహుఁ. . . రాత్రి ఉండటానికి పెర్మిషన్ లేదు. రేపు ఎలాగా వస్తాగా? అప్పుడు చూస్తాలే" అంటూ వెళ్లిపోయాడు. పోతూ పోతూ తన చేతిలో ఒక ఉత్తరం ఉంచి వెళ్లిపోయాడు బావ.

ఒక్క క్షణం విస్మితురాలైంది తను. ఉత్తరం ఏమిటీ. . . ఏమి రాశాడో బావ? కుతూహలం ఆపుకోలేక ఉత్తరం మడత విప్పింది చదవటానికి. గుమ్మంముందు కారాగిన చప్పుడు. . . వెంటనే ఉత్తరం మడత పెట్టేసింది. బావ ఒకవేళ అసందర్భపు విషయాలేవైనా రాసి ఉంటే? తన మనసేమో నిష్కళంకమైనది. అయితే, ఇది అపార్థానికి దారి తీస్తే. . . "అమ్మో!" తడబడే అడుగులతో వంటగదికేసి వెళ్లింది. ఆ ఉత్తరం ఎక్కడ దాచాలో దిక్కు తోచలేదు క్షణం. ఆ ఉత్తరం దాచే ప్రయత్నంలో ఉత్తరంలో ఏముందోననే కుతూహలం కూడా చచ్చిపోయింది! ఎక్కడో అలమరలో డబ్బాల మధ్య పడవేసి అప్పటికి తప్పించుకొంది. అత్తయ్య అక్కడ లేకుంటే గుర్తుగా ఎక్కడైనా పెట్టేదేమో? భర్తకు కాఫీ, టిఫిను అందించటం, పిల్లల పనులూ, మళ్లీ భోజనాలూ ... రాత్రి పది వరకూ ఆ ఉత్తరం చూసే అవకాశమే దొరకలేదు. రాత్రి అందరూ పడుకొన్న తరవాత వంటగదిలో కెళ్లింది, మెల్లగా అడుగులు వేసుకుంటూ. పోపు డబ్బాల మధ్య వెతికింది. ఊహుఁ. దొరకలేదు.

"ఏమిటే, జానకీ, ఇంకా నీ సర్దుడు తెమలలేదా? టైమెంత అయిందో చూడు. పదకొండు కావస్తోంది." శ్రీహరి మాటలతో ఉలిక్కిపడింది. అంతే. ఇంక వెతికే ప్రయత్నం మానుకొంది.

రాత్రి పడుకొంటే బావే తన కళ్ల ముందు మెదులుతున్నాడు. ఇప్పుడు ఎంత నిండుగా ఉన్నాడు మనిషి! అమ్మ అన్న మాటలు గుర్తుకొచ్చాయి. నిజంగా అభిమానం గల మనిషే బావ అనిపించింది. కాస్సేపు దిగులు వేసింది, బావ యుద్ధప్రాంతాలకి వెళ్తున్నాడంటే.



ఢిల్లీలో ఇటీవల తెలుగు సాహితి ఆధ్వర్యంలో 'వీరేశలింగం' గ్రంథా విష్కరణ జరిగింది. ఈ సందర్భంలో సుప్రసిద్ధ కవి, పండితులు పద్మశ్రీ పుట్టపర్తి నారాయణాచార్యులను సన్మానించారు. చిత్రంలో డి. ఆంజనేయులు, పుట్టపర్తి నారాయణాచార్యులు, దామోదరం సంజీవయ్య, నార్ల వెంకటేశ్వరరావు, మంజుశ్రీ ఉన్నారు.

ఆ ఉత్తరం ఉదయమైనా చూడాలి. బావమీద కాస్త కోపంకూడా వచ్చింది. ఉత్తరం ఎందుకు రాయాలి? అంత రహస్యం ఏమిటీ? అయినా, ఉత్తరంలో ఏముందో. . . మనసంతా గజిబిజిగా ఉండి నిద్ర పట్టలేదు తనకు.

ఆలోచనలతోనే తెల్లవారింది. ఉదయం లేచిందే మడి కట్టుకొని అత్తయ్య తయారు వంట ఇంట్లో. ఇంక అత్తయ్య వంటా అదీ పూర్తి కానిచ్చుకొని బయటపడేదాకా తనకు ఆ ఉత్తరం వెతికే అవకాశం దొరకదు. హుం. . . బరువుగా నిట్టూర్చింది. బావమీద నిజంగానే కోపం వచ్చింది. ఈసారి. ఎంత సస్పెన్సులో ఉంచింది ఈ ఉత్తరం తనని! అమ్మయ్య. . . అత్తయ్య వంటిల్లు వదిలి ఇవతలికి వచ్చింది. థాంక్ గాడ్! లోపలికి వెళ్లి మళ్లీ అలమారంతా వెతికింది. ఊహుం. . . కనపడ లేదు. ఎక్కడ ఉంచిందీకూడా సరిగా గుర్తు రాలేదు. వెతికి వెతికి నేసారి పోయింది తను. చివరికి, సరే బావ ఎలాగూ వస్తాడుగా, అప్పుడు ఎలాగో వీలు చూసుకొని విషయం తెలుసుకోవచ్చు అనుకొంటూ ఇంక వెతికే ప్రయత్నం మానుకొంది.

అనుకొన్నట్లుగానే వెళ్లడానికి ముందు బావ వచ్చాడు ఇంటికి. ఆయన ఉన్నారు ఇంట్లో, సెలవురోజు కాబట్టి తను ముందు రోజే చెప్పి ఉండటం వల్ల, బావను చూసిందే కరచాలనం చేశారు ఆయన. ప్రాణాలకు తెగించి దేశం కోసం వెళ్లుతున్న వారందరినీ అభినందించారు ఆయన. బావకూడా ఆయనతో హృదయపూర్వకంగా మాట్లాడాడు. మునుపటిలాగా బావ కళ్లలో దీనత్వం లేదు ఇప్పుడు. అదే స్థానంలో ధృఢ నిశ్చయం, పట్టుదల ఉన్నవి. బావను ఈ విధంగా చూడటంలో తనకు చాలా సంతోషం, గర్వం కలిగాయి.

బావను ఆ ఉత్తరం విషయం అడగటానికే వీలు లేకపోయింది. ఆయన ఏమనుకొంటారో, తరవాత అది ఎలా పరిణమిస్తుందో అని భయం వేసి ఊరుకొంది. వెళుతూ వెళుతూ బావ సాభిప్రాయంగా తనను చూశాడు. తనకు అయోమయంగా ఉంది. ఆ పరిస్థితిలో ఏం అడగగలదు తను? బావ కళ్లలో ఒక్క క్షణం నిరాశాభావం తళుక్కున మెరిసి మాయమైంది. బావ వెళ్లిపోయాడు, అందరికీ "గుడ్‌బై" చెప్పి. తన కెందుకో చాలా దిగులు వేసింది.

బావ వెళ్లిన వారం రోజులకు గావును, ఒక రోజు తను ఏదో కూర తరుగుతూ కూర్చుంది. అత్తయ్య వంట చేస్తున్నారు. "రోజు రోజుకీ నాకు పరాకు ఎక్కువైపోతున్న దమ్మాయ్. చూడు, ఈ కాగితం ముక్కకూడా డబ్బాలో పడవేసి ఉన్నాను." నవ్వుతూ ఆ కాగితాన్ని ఉండచుట్టి క్రింద పడవేశారు అత్తయ్య. గబుక్కున తనకు బావ ఉత్తరం గుర్తుకొచ్చింది. దాన్ని బయట పారవేసే నెపంమీద ఇవతలి కొచ్చి కాగితం విప్పి చూసింది ఆత్రతగా.

"జానకీ, ఇలా చాటుగా ఉత్తరం వ్రాస్తున్నానని అన్యథా భావించకు. ఇప్పుడు నీ మీద నాకు సోదరభావం తప్ప మరేమీ లేదని నిశ్చయంగా చెప్పగలను. ఒకప్పుడు నీ సానుభూతి వాక్యాలు, అత్తయ్య ఆదరణ— ఇవి రెండే నాకు జీవం పోసి నన్ను మనిషిగా చేశాయి. అందుకే నేను సరిహద్దు ప్రాంతాలకు వెళ్లేముందు మిమ్మల్ని ఒకసారి చూసి పోదామనే వచ్చాను. అత్తయ్య ఈ లోకాన్నే విడిచింది. నిన్నైనా చూసే భాగ్యం కలుగుతున్నందుకు సంతోషిస్తున్నాను. యుద్ధం ఏ క్షణాన్నైనా మొదలవచ్చు. మళ్లీ రావటం మాట ఏమో. . . అందుకే నే నొకటి అడగాలనుకొన్నాను, జానకీ. అల్ప విషయంగా భావిస్తావేమో? నీకు తెలుసుగా—నాకు చేగోడీ లంటే చాలా ఇష్టమని? నేను వెళ్లేలోగా మరోసారి వస్తాను. అప్పుడు నాకు కాస్త అవి చేసి ఇస్తావా, జానకీ? ఇంత అల్ప విషయం నలుగురి ఎదటా అడగటానికి సిగ్గుగా అనిపించి ఉత్తరం మూలంగా తెలుపుతున్నా మనాఅభిలాషను- యుద్ధస్థలానికి వెడుతూ తమ ఆత్మీయులవద్దనుండి ప్రీతిపూర్వకంగా ఏదైనా స్వీకరిస్తే అది శుభసూచకంగా భావిస్తారు. నాకు నీవు తప్ప ప్రస్తుతం ఆత్మీయులు ఎవరున్నారు, జానకీ?"

వేడి కన్నీటిచుక్కలు ఉత్తరం మీద టపటపా పడ్డాయి. 'అయ్యో, ఈ ఉత్తరం ఇంత ఆలస్యంగా దొరికిందే! పూర్ బావ, ఆ విషయం అప్పుడే చెప్పి ఉండవచ్చునే! అర్థం లేకుండా ఉత్తరం వ్రాసి, తనను ఎంత మానసిక చిత్రహింసకు గురి చేశాడు! భగవాన్! ఈ ఉత్తరం దొరక్కుండానే ఉండి ఉంటే ఎంత బాగుండేది! అందుకేనేమో వెళుతూ వెళుతూ తనను సాభిప్రాయంగా చూశాడు! ఎంత నిరాశ చెంది ఉంటాడు బావ! గ్రేట్ డిసప్పాయింట్‌మెంట్ బావకు. ఉత్తరం చూసీ తను అలక్ష్యం చేశానని అపార్థం చేసుకొన్నాడేమో? ఇప్పుడేం చేయటం?' ఒక్కసారి నీరసం ఆవరించింది తనని. అమ్మ మాటలు గుర్తుకొచ్చాయి. తెలిసీ చేయక పోయినా పరోక్షంగా బావ మనసు తీవ్రమైన నిరాశకు గురి అవడానికి తనే కారణమైంది. 'ఆత్మీయుల వద్దనుండి ఏమీ స్వీకరించకుండా పోవడం ఒకవేళ అశుభసూచకమేమో?' నిలువెల్లా వణికి పోయింది భయంతో. అక్కడే కూలబడి పోయింది. అత్తయ్య వచ్చి అడిగేదాకా తనకే తెలియదు తనలా ఎంతసేపు కూర్చుండి పోయిందో? అత్తయ్య అడిగిన దానికి కాస్త కళ్లు తిరిగినట్లయి అలా కూర్చుండిపోయానని చెప్పి తప్పించుకొంది.

యుద్ధం మొదలైంది. తన భయం ద్విగుణీకృతమైంది. 'బావ క్షేమంగా తిరిగి రావాలి. ఈ వ్యథ తీరని వ్యథగా మారిపోకూడదు!' పదేపదే భగవంతుణ్ణి ప్రార్థించేది తను.

కానీ, తన భయం నిజం చేస్తూ ఆయన ఒక రోజు పిడుగు లాంటి వార్త చెప్పనే చెప్పారు. "జానకీ, వెరి శాడ్ న్యూస్! మీ నాన్న ఉత్తరం వ్రాశారు . . . మీ బావ. . ."

"యుద్ధంలో చనిపోయాడు. . . అంతేనా. . . నాకు తెలుసు. . . నాకు తెలుసు. . . బావ చచ్చిపోతాడని. బావ ఎప్పుడూ దురదృష్టవంతుడే. చివరకు దిక్కులేని చావు చచ్చాడు. . . నాకు తెలుసు ఇలా అవుతుందని. . ." మొహం మీద చేతులు కప్పుకొని భోరున ఏడ్చేసింది తను. ఆయన తన వీపు నిమురుతూ అనునయంగా— "జానకీ, మీ బావ దురదృష్టవంతుడే కావచ్చు. కానీ, అతని మరణం దిక్కులేని మరణం కాదు. అతని చావు ధన్యమైంది. దేశం కోసం ప్రాణాలు వదిలిన అతను అమరజీవి" అంటూ హృదయపూర్వకంగా అన్న మాటలు తనను శాంతింపజేసినా, బావ ఆఖరి కోర్కె తీర్చలేకపోయాననే అన్నది మాత్రం తీరని వ్యథగానే మిగిలిపోయింది! అది చల్లారని మంట! *